క్లుప్తంగా

ఆర్థిక సాయం



మంగపేట: మండలంలోని కొత్తమల్లూరు (బెస్తగూడెం)లో ఇటీవల మృతి చెందిన బట్ట సతీష్ కుటుంబానికి మిర్చి టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చందర్లపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థికసాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతుడి భార్య నిర్మలకు రూ. 2వేల నగదుతో పాటు రాజుపేట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ ఇచ్చిన 25 కేజీల బియ్యాన్ని అందచేశారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

బొడ్రాయి వార్షికోత్సవ పూజలు



గోవిందరావుపేట : మండల కేంద్రంలో శని వారం బొడ్రాయి ఏడో వార్షికోత్సవ ఉత్సవాలు గ్రామప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వార్షికోత్సవం సందర్భంగా గ్రామదేవతలకు గ్రామ పెద్దలు పూజారి శివశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచమ్మ దేవాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పోచమ్మ దేవాలయం ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బురదలో దిగబడిన బియ్యం లారీ



వెంకటాపురం(కె): మండలపరిధిలోని వాడగూడెం గ్రామ సమీపంలో శనివారం బియ్యం లోడ్ లారీ రోడ్డు పక్కన ఉన్న బురదలో ఇరుక్కుపోయిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని జీసీసీ గోడ్ నుంచి బియ్యం బస్తాలను లోడ్ చేసుకొని వాడగూడెంలోని స్టోర్‌లో బియ్యం దిగుమతి చేసేందుకు వెళ్తోంది. లారీ వాడగూడెం సమీపంలో గ్రామంలోకి వెళ్తున్న క్రమంలో ఆటోను తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న బురదలో లారీ ఇరుక్కుపోయింది. కాగా జీసీసీ అధికారులు లారీని బయటకు తీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



ఏటూరునాగారం: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మండల కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మండల కేంద్రంలో టీపీటీఎఫ్ మండల కమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు హట్కార్ సమ్మయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన సమక్షంలో మండల అధ్యక్ష కార్యదర్శులుగా పల్లె నాగరాజు, భూక్యా సారంగపాణిలను ఎన్నుకుని నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అబ్బోజు రాజేంద్ర ప్రసాద్, చాట్ల రవి, శశిధర్, బలరామ్, శ్యామ్‌సుందర్ ఉన్నారు.

ఎస్‌టీయూ మండల కమిటీ..



ఆనంద్, అధ్యక్షుడు



జలీల్, ప్రధాన కార్యదర్శి

టేకుమట్ల: ఎస్‌టీయూ టీఎస్ మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు రమేశ్‌నాయక్, జిల్లా సీనియర్ నాయకుడు కుర్రె ప్రవీణ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నియమించారు. మండల అధ్యక్షుడిగా నేరుపాటి ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా జలీల్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

ఏటూరునాగారం : ఈనెల 26న శ్రీకృష్ణాష్టమి వేడుకల సందర్భంగా ముందస్తుగా శనివారం పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణుడు, రాధ, సత్యభామ, గొల్లభామల వేషధారణలతో విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో పాఠశాలల్లో సందడి నెలకొంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని విజన్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామాలయంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని శ్రీరామాంజనేయస్వామి ఆలయంలో శనివారం జోహార్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో ఆలయానికి చేరుకొని ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉట్టికొట్టి గెలుపొందిన విద్యార్థులకు రామాలయ చైర్మన్ నరెడ్ల భాస్కర్ బహుమతులను అందించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ అబ్దుల్ జాహీద్, ఆలయ అర్చకుడు ముదుంబా రఘునాథాచార్యులు, సభ్యులు రామిడి లక్ష్మారెడ్డి, ఆకుల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం (ఎం) : జోహార్ స్కూల్‌లో ఉట్టి కొడుతున్న బాలుడు



వెంకటాపురం(ఎం): గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందిస్తున్న ఆలయ చైర్మన్ భాస్కర్



వెంకటాపురం(కె): వివిధ వేషధారణలో పాల్గొన్న విద్యార్థులు

రుణమాఫీకి కట్టుబడి ఉన్నాం

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకన్న

ఏటూరునాగారం : రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలపై వారిని నమ్మి రోడ్డు ఎక్కవద్దని, కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీకి కట్టుబడి ఉందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవట్ల వెంకన్న అన్నారు. శనివారం ముండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.రెండు లక్షల రుణమాఫీ సందర్భంగా మండల అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో రైతులు భారీ ఎత్తున తరలివచ్చారు. పార్టీ శ్రేణులు నాయకులు, యువకులు, మహిళలు అందరితో తమ ఆనందాన్ని పంచుకుంటూ బాణసంచా కాలుస్తూ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రుణమాఫీ పొందిన బీఆర్ఎస్ నాయకులే ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి నాయకుల మాటలు రైతులు నమ్మొద్దని కోరారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనన్న చిత్రపటాలకు ఘనంగా క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయూబ్, ఖలీల్, దేవేందర్, లాలయ్య, గౌస్, సులేమాన్, వికాస్, కిరణ్, సర్దార్‌పాషా, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.



సీఎం, మంత్రుల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్గానిక్ ఉత్పత్తులతో ఆరోగ్యానికి మేలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న నాగరాజు

గోవిందరావుపేట : రైతులు తమ పంటలపై ఆర్గానిక్ ఉత్పత్తులను వినియోగించడం వల్ల మంచి ఆరోగ్యం అధిక దిగుబడి సాధించవచ్చని కేబీ ఆర్గానిక్ కంపెనీ వరంగల్, కరీంనగర్ ఏరియా అభివృద్ధి అధికారి నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని చల్వాయిలో ములుగు ఏరియా ఎస్ఈ బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్గానిక్ వినియోగం పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ అపరితమైన విషతుల్య క్రిమిసంహారక రకాల వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతినడంతో పాటు, ప్రజల ఆరోగ్యం కూడా క్షీణించి, నానాటికి కేన్సర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు అని అన్నారు. అత్యాధునిక మార్కర్ కాంపౌండ్ టెక్నాలజీతో పర్యావరణానికి ప్రమాదం లేకుండా పురుగులను తెగులను సమర్థవంతంగా నివారించే సామర్థ్యం ఉన్న ఎకో ఫ్రెండ్లీ ఉత్పత్తులను అందిస్తున్నామని తెలిపారు. వరిలో నాచును మొలవకుండా, మొలిచిన నాచును లేకుండా చేస్తుందన్నారు. వేపనూనె వినియోగాన్ని కూడా రైతులు పెంచుకోవాలి. వరి పంటపై ఆర్గానిక్ 3000 పీపీఎం అనే నూనెను నెల రోజుల వ్యవధిలో ఒకసారి ఎరువుతో గాని పిచికారి చేస్తే లేదా మందులతో గానీ కలిపి వాడినట్లయితే పురుగు దోమ గుడ్డు దశ సమూలంగా నాశనం చేస్తుందన్నారు. మొక్క చేదుగా ఉండడం వల్ల దోమ రసం పీల్చకుండా మొక్కలు సురక్షితంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాజ్ కుమార్ తో పాటు రైతులు పాల్గొన్నారు.

డ్యూటీకి రాకున్నా ఫుల్ జీతం

- పాఠశాల ప్రారంభం నుంచి విధులకు హాజరు కాని ఉపాధ్యాయుడు
- విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్న డీఈఓ

కన్నాయిగూడెం: మండలంలోని ఓ పాఠశాల ఉపాధ్యాయుడు డ్యూటీకి రాకున్నా ఉన్నతాధికారులు ఫుల్ జీతాలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లక్ష్మీపురం మండల ప్రాథమిక పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం అందులో నలుగురు ఉన్నప్పటికీ అర్జియా అనే ఉపాధ్యాయుడు జూన్ 12 నుంచి ఇప్పటి వరకు స్కూల్‌కు రాలేదని విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు బాహాటంగానే చెబుతున్నారు. కానీ అతనికి జూన్, జూలై నెలల్లో ఫుల్ జీతం వేసి ఆగస్టులో కూడా జీతం చేసి ఎస్టీలో వేస్తున్నట్లు సమాచారం. విషయం బయటికి రాకుండా మరో రిపోర్టు తయారు చేసి అర్జియా జీతం తొలగించి వేసినట్లు మండలంలో పలువురి నుంచి గసగుసలు వినబడుతున్నాయి. ఈ ఉదంతమంతా ఇన్‌చార్జ్ ఎంఈఓ, కాంప్లెక్స్ హెచ్‌ఎం కలిసి చేసి ఉంటారని పలువురు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. దీనిపై పాఠశాల హెచ్‌ఎంను పూర్తి వివరణ కోరగా జూన్ 12 స్కూల్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు అర్జియా డ్యూటీలో భాగంగా పాఠశాలకు రాలేదు. హాజరు మాత్రం నిబంధనల ప్రకారం ఓసీఎల్ వేస్తున్నాం. జీతం మాత్రం వస్తుందన్న విషయం మాకు తెలియదు. రిపోర్టు మాత్రం డ్యూటీకి రావడంలేదని పెట్టాం. ఏదైనా కాంప్లెక్స్ హెచ్‌ఎంకు, ఎంఈఓకు తెలుసని సమాధానం ఇచ్చారు. ఈ విషయమే కాంప్లెక్స్ హెచ్‌ఎం ముప్పనపల్లి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌ను ఫోన్‌లో సమాచారం కోరగా ఫోన్ లేపి నాకు వినపడడం లేదు. నాకు తెలియదంటూ దాటవేశారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ ఎంఈఓ రాజేష్‌కు పలుమార్లు ఫోన్‌లో సంప్రదింపగా వారు సమాధానం చెప్పకుండా ఫోన్ కట్ చేస్తున్నారు. దీంతో జిల్లా విద్యాశాఖాధికారి పాణిణీ వివరణ కోరగా ఈ రోజు మాత్రమే మా దృష్టికి వచ్చింది. దానిపై విచారణ చేసి నిజంగానే డ్యూటీకి రాకున్నా జీతం చేసినట్లు రుజువైతే అందులో పాత్ర ఉన్న ప్రతీ ఒక్కరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు మొత్తం డబ్బులు రికవరీ చేయడం జరుగుతుందని చెప్పారు.

సేవాభావం కలిగి ఉండాలి



చిట్యాల: సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని చిట్యాల సెకండ్ ఎస్సై ఎండి.శాఖాన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సిరి పెరల్స్ అండ్ జ్యువెలరీ హనుమకొండకు చెందిన శానం శివ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉమా–శివ దంపతులు విద్యార్థులకు బ్యాగులు, డిక్షనరీలు, పరీక్ష ప్యాడ్లు అందించగా ఎస్సై చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకుని భవిష్యత్‌లో ఉద్యోగాలు సాధించి ఇలాంటి సేవా భావాలు అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అఖిల, మాజీ ఎంపీటీసీ కట్కూరి పద్మ నరేందర్, ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం రఘుపతి, దేవేందర్‌రెడ్డి, నాగరాజు, ఉపాధ్యాయులు నీలిమారెడ్డి, బుర్ర సదయ్య, శ్రీనివాస్, సదయ్య, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ చిదిరాల సరోజన తదితరులు పాల్గొన్నారు.

'హరితహారం'పై గొడ్డలివేటు

చిట్యాల: హరితహారంలో భాగంగా రెండు సంవత్సరాల క్రితం మండల కేంద్రంలో నాటిన చెట్టును శనివారం ఓ వ్యక్తి నరికి నేల కూల్చాడు. ఏపుగా పెరిగిన చెట్టును నరకడంతో వన ప్రేమికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు అడ్డు వస్తుందనే కారణంతో మండల కేంద్రంలోని చెట్టును నరికి వేసినట్లు సమాచారం. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా తనకేమీ సమాచారం లేదని అన్నారు.

అర్హులైన దివ్యాంగులకు ఉపకరణాలు



దివ్యాంగుల ఉపకరణాల కోసం రైతు వేదికలో ఏర్పాటు చేసిన క్యాంపు

- ఐసీడీఎస్ సీడీపీఓ ప్రేమలత

కన్నాయిగూడెం: అర్హులైన దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తామని సీడీపీఓ ప్రేమలత అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో దివ్యాంగులకు ఉపకరణాలు అందించడానికి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అర్హుల ఎంపిక కోసం అధికారులతో సీడీపీఓ క్యాంపు ఏర్పాటు చేశారు. మండలంలోని దివ్యాంగులకు సమాచారం ఏర్పాటు చేసి వారి నైపుణ్యాన్ని గుర్తించి వారికి ఎలాంటి ఉపకరణాలు అందించాలి, వారికి అవగాహన కల్పించి ముందుకు వచ్చే విధంగా శిక్షణ ఇచ్చి మంచి గుర్తింపు వచ్చేవిధంగా చేయడం జరుగుతుందని ప్రేమలత అన్నారు. శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమానికి అలీంకో సంస్థ సహకారంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 40 నుంచి 80 శాతం వరకు పైబడిన వారిని ప్రత్యేకంగా గుర్తించి సహకరించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పవతి, సీహెచ్ఎస్ సిబ్బంది, రజిని, గీత, చంటి, ఆస్పిరేషనల్ బ్లాక్ కో ఆర్డినేటర్ రవీష్, తదితరులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి



మొగుళ్లపల్లి: మెట్టుపల్లిలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



కాటారం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు మౌనిక

మొగుళ్లపల్లి: ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని డాక్టర్ నాగరాణి అన్నారు. మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో మొగుళ్లపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ నాగరాణి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజన్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేడివేడి ఆహార పదార్థాలు తినాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో 52 మందికి పరీక్షలు నిర్వహించి ముగ్గురికి రక్త నమూనాలను తీసి ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. అలాగే వేములపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లను, పాఠశాలలను తనిఖీ చేసి సీజన్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పల్లె దవఖాన వైద్యాధికారిణి డాక్టర్ సంధ్యారాణి, సూపర్‌వైజర్ జమున, ఏఎన్ఎం స్వరూప, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాళేశ్వరం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహదేవపూర్ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ గంట చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో ఆస్పత్రిలో మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో దోమల లార్వా వృద్ధి చెందే ప్రదేశాలను సకాలంలో గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. 24 గంటలు అందుబాటులో ఉంటూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఐదు మండలాల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారన్నారు. ఆస్పత్రిలో సమస్యలను ఎప్పటికప్పుడు మంత్రి, ఆస్పత్రి చైర్మన్ శ్రీధర్ బాబు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తున్నట్లు వివరించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

కాటారం: హాస్టళ్లలో ఉండే విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారిని మౌనిక సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో శనివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది విద్యార్థులకు జ్వర, రక్తహీనత పరీక్షలు, పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వంటశాలలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వేడి పదార్థాలను ఎప్పటికప్పుడు తయారు చేసి విద్యార్థులకు వడ్డించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ తిరుపతిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఆశ వర్కర్లు లత, స్వరూపరాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆలయంలో హుండీ చోరీ



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీని చోరీ చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఆలయ కమిటీ సభ్యుల కథనం ప్రకారం.. శనివారం ఉదయం ఆలయ పూజారి పూజలు చేసేందుకు ఆలయానికి వచ్చే సమయానికి గుడి ప్రధానద్వారం తాళాలు పగులగొట్టి కనిపించాయని తెలిపారు. పూజారి లోపలికి వెళ్లి చూసేసరికి ఆలయంలోని హుండీ కనిపించలేదని చెప్పారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఎస్సై తాజుద్దీన్ సంఘటన ప్రాంతానికి చేరుకొని పరిశీలించి ఆధారాలను సేకరించారు. అనంతరం చుట్టు ప్రక్కల ప్రాంతాలను పరిశీలించగా జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో ఆలయ హుండీ కనిపించిదని తెలిపారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుడుంబా స్వాధీనం.. ఇద్దరిపై కేసు

ఏటూరునాగారం: అక్రమంగా 20 లీటర్ల గుడుంబాను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఏటూరునాగారం సెకండ్ ఎస్సై రమేశ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో హెడ్‌కానిస్టేబల్ రామారావు, కానిస్టేబుల్ అజయ్, శ్రీనివాస్ వాహనాలు తనిఖీ చేస్తుండగా కమలాపురం గ్రామానికి చెందిన భూక్య లక్ష్మణ్, పోరిక వినోద్ బైక్‌పై సంచితో కనిపించారన్నారు. అది తనిఖీ చేయగా అందులో ఒక్కొక్కరి చేతిలో పది లీటర్ల గుడుంబా ఉంది. మొత్తం 20 లీటర్ల గుడుంబాను పట్టుకొని సీజ్ చేశామన్నారు. మంగపేటకు చెందిన శివశంకర్ కిరాణం షాపులో బెల్లం, పటిక కొనగోలు చేసి గుడుంబా తయారీ చేసి అమ్ముతున్నట్లు నిందితులు ఒప్పుకున్నారన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



వాజేడు: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కారులో తరలిస్తున్న మద్యంను పోలీసులు శనివారం పట్టుకున్నారు. వాజేడు ఎస్సై రుద్రారపు హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మండపాక వద్ద సెకండ్ ఎస్సై ఇమాన్యుయేల్ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. టీఎస్ 03 ఈబీ 3600 నంబర్ కారు ఏటూరునాగారం వైపు నుంచి మండపాక వైపు వస్తుంది. పోలీసులను చూసి పారిపోతున్న కారును ఆపి విచారించగా అందులో అనుమతి లేకుండా తరలిస్తున్న రూ.82,674 విలువ గల మద్యం లభించింది. ఏటూరునాగారం మండల పరిధిలోని శంకర్‌రాజుపల్లికి చెందిన ఎగ్గడి తేజ మద్యంను తరలిస్తుండడంతో అతనిపై కేసు నమోదు చేసిన పోలీసులు మద్యంతో పాటు కారును సీజ్ చేసినట్లు తెలిపారు.

గంజాయి స్వాధీనం



వెంకటాపురం(కె): మండల కేంద్రంలో సుమారు రూ.లక్ష విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులను , రెండు ద్విచక్ర వాహనాలను శనివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నుంచి రెండు ద్వి చక్ర వాహనాలపై ముగ్గురు అనుమానంగా కనిపిస్తుండడంతో పోలీసులు వారిని ఆపి తనిఖీలు చేయగా వారి వద్ద నాలుగు కిలోల గంజాయి లభించినట్లు తెలిపారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రెండు ద్విచక్రవాహనాలను, నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు దామోదర్

రేగొండ: పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ దామోదర్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ తిరుపతి ఆధ్వర్యంలో ఐకేపీ, వీఓఎలకు బాలల హక్కులు, చట్టాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సై సందీప్‌కుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ దామోదర్ హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల అలవాట్లను గమనిస్తూ వారితో కొంత సమయం గడపాలన్నారు. పిల్లలకు శారీరక, మానసిక సమస్యలు ఉంటే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సఖీ సెంటర్ గాయత్రి, ఉమెన్ హబ్ అనూష, ఏపీఎమ్ తిరుమల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వారసంత నిర్వహణకు వేలం



వేలం పాటలో పాల్గొన్న గ్రామస్తులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే కూరగాయల మార్కెట్ సంత నిర్వహణకు శనివారం మండల ప్రత్యేక అధికారి సునీత ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఆవరణలో వేలం పాట నిర్వహించారు. సుమారు 17 మంది వేలంలో పాల్గొనగా సంవత్సరానికి రూ.35,500లతో నిమ్మల సారయ్య దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా నిమ్మల సారయ్య మాట్లాడుతూ... మార్కెట్ సంతకు వచ్చే వ్యాపారవేత్తలు, స్థానిక వ్యాపారులు, ప్రజలు అందరూ పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, కారోబార్ అబ్బు, జీపీ పాలక మండలి మాజీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.